# గద్యభాగం

## 1. గోలకొండ పట్టణం

### 20 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. గోలకొండ పట్టణ నిర్మాణం - విశిష్టతను తెలపండి. ?**

జ. పట్టణం అంటే గోలకొండ పట్టణమే అని దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందింది. గోలకొండ దుర్గం అంటే మూడుకోటలు. మొదటి రెండు కోటల ప్రాకారాల మధ్యనే గోలకొండ పట్టణంలోని ముఖ్యభాగం ఉంది. ఈ దుర్గానికి 7 మైళ్ళ కైవారము, 87 బురుజులు, ఎనిమిది దర్వాజాలు ఉన్నాయి. దీనికి సుమారు 4 మైళ్ళ వైశాల్యం ఉంది.

గోలకొండ పట్టణాన్ని "ఆజంఖాన్" ఇంజనీరు కట్టాడు. ఈ పట్టణాన్ని పెక్కు భాగాలుగా విభజించారు. ఆ భాగాలను "మొహల్లాలు" అని పిలిచేవారు. "మొహల్లా "అంటే వీధి.

గోలకొండ పట్టణంలో ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱాలు ఎక్కువగా ఉండేవి. పట్టణం సందడిగా ఉండేది. పడమటి దిశలో రాజభవనాలు ఉండేవి. మిగిలిన దిశలలో ప్రజలు ఉండేవారు.

గోలకొండ పట్టణానికి పెంపు, సొంపులు సమకూర్చడంలో మొదటి, నాల్గవ, ఐదవ, ఏడవ కుతుబ్షాలు శ్రద్ధ చూపించారు. ఇబ్రహీం కుతుబ్షా సర్దార్లనూ, ధనవంతులనూ కోటలోనే ఇళ్ళు కట్టమని చెప్పాడు.

కచ్చేరి భవనాలు, ఉద్యోగస్తుల భవనాలు, దేవాలయాలు, మసీదులు, ధర్మశాలలు, భిక్షాగృహములు, అందమైన ఉద్యానవనాలు, పాఠశాలలు, స్నానమందిరాలు నగరంలో నిర్మింపబడ్డాయి. నగీనాబాగ్ అనే అందాల ఉద్యానవనం ఉండేది.

నాటి ఇంజనీర్లు తమ ప్రతిభతో "షాహిమహలులు" అనే రాజభవనాలు నిర్మించారు. 'దిల్‌కుషా' అనేది అందమైన రాజభవనము. యుద్ధభటులకు రెండు బారకాసులు ఉండేవి. అందులో ఒక బారకాసు కోటలో రెండు ప్రాకారాల మధ్య ఉండేది.

**ఉద్యానవనములు :** గోలకొండ పట్టణంలో ఆకర్షణీయమైన మిద్దెల మీద తోటలు (Roof gardens) ఉండేవి. భవనాలపై మంచి నైపుణ్యంతో వాటిని నిర్మించారు. ఆ ఉద్యానవనాలకు నీటిని సరఫరా చేసే విధానము, అక్కడ నీటికాలువలు, జలాశయములు, జలపాతములు, కేళాకూళులు ఆశ్చర్యం కలిగించేవి.

మజ్నూబురుజుకు వాయవ్య దిశలో 'దొడ్డ బాల్బోవా' అనే 80 అడుగుల కైవారం గల చెట్టు ఉండేది. దాని తొఱ్ఱలో బల్లపై నలుగురు కూర్చొని టిఫిను తినగలిగేవారు. 'కటోరా' అనే జలాశయం ఉండేది. ఈ ప్రాంతంలో గొప్పవారు వేసవిలో విహరించేవారు.

గోలకొండలో సుమారు 2 లక్షల మంది ప్రజలు ఉండేవారు. ఈ ప్రజల సౌకర్యానికి "మహమ్మద్ కులీకుతుబ్షా" 78 లక్షల హొనులు ఖర్చు చేశాడు.

పట్టణంలో జనానికి త్రాగునీరు దొరకడానికి మంచి ఏర్పాటు చేయబడింది. ఈ దుర్గంలో చెరువు నుండి, భూమిలో నుండి మట్టి గొట్టముల ద్వారా నీటిని పంపి, కటోరా హౌజును నింపేవారు. కటోరా హౌజు నుండి నీరు మట్టిగొట్టాల ద్వారా పట్టణంలో చాలా ప్రాంతాలకు సప్లయి అయ్యేది. నీటి నిల్వకు చాలా హవజులు నిర్మించారు. ఇందులో కొన్ని జనానా వారికి ప్రత్యేకింపబడ్డాయి.

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

**1. చారుమినార్ నిర్మాణం – ప్రాముఖ్యాన్ని తెలపండి.**

జ. గోలకొండ పట్టణములో 1589వ ప్రాంతములో మహామారీ పీడ సంభవించింది. లెక్కలేనంత మంది ప్రజలు మరణించారు. చివరకు కొంతమంది సాధువులు, పీర్ల పంజాలు, తాబూతులు పట్టుకొని, భజనలతో ఊరేగారు. అందువల్ల ఆ మహామారిపీడ వదలిపోయింది.

దానికి జ్ఞాపక చిహ్నముగా, కృతజ్ఞతా సూచకంగా మహమ్మదు కులీకుతుబ్‌షా పాదుషా, 1591వ సంవత్సరములో హైదరాబాదులో "తాబూతు" ఆకారములో 'చారుమినారు'ను నిర్మించాడు.

**2. గోలకొండ పట్టణంలోని పరిశ్రమలు ఏవి ?**

జ. గోలకొండలో దచ్చివారు రంగుల కర్మాగారమును నడిపేవారు. అక్కడ ఉన్న పరిశ్రమ, ఇనుము పరిశ్రమ ఉండేవి. ఈ ఇనుము కర్మాగారంలోనే ఆయుధములు, ఫిరంగులు నిర్మించేవారు.

గోలకొండ పట్టణంలో గొప్ప అధికారులు సైతం వర్తకము చేసేవారు. 'మీరు జుమ్లా' అనే మంత్రి కొన్ని వజ్రపు గనులకు సొంతదారుడయి ఉండేవాడు. అక్కన్న సేనాని, కొన్ని ఓడలకు సొంతదారు. ఆయన ఓడల వ్యాపారం చేసేవాడు.

పైఠన్ వస్త్రాలు, బందరు కలంకారీ చీరలు ఎక్కువగా అమ్ముడయ్యేవి. బియ్యం, జొన్నలు, గోధుమలు, చందనము, సీసము, తగరము, కస్తూరి, చైనా పట్టుగుడ్డలు, కర్పూరము, గాజు సామానులు, సుగంధ ద్రవ్యములు మొదలయిన వాటిని వారు దిగుమతి చేసుకొనేవారు. విదేశాల నుండి వచ్చే సరకులు బందరు రేవు నుండి నేరుగా గోలకొండకు వచ్చేవి.

## ఏకవాక్య సమాధాన ప్రశ్నలు

**1. 'గోలకొండ పట్టణము? వ్యాసాన్ని రాసేందెవరు ?**

జ. గోలకొండ పట్టణము అను వ్యాసాన్ని ఆదిరాజు వీరభద్రరావు గారు రాశారు.

**2. ఆదిరాజు వీరభద్రరావుగారి అభిరుచులు ఏమిటి ?**

జ. చరిత్ర, శాసనాలు పరిశోధించడం, సాహిత్య సృజన, కథారచనలు చేయడం అనే పనులు, వీరభద్రరావుగారికి అభిరుచులు.

**3. గోలకొండ పట్టణాన్ని రూపొందించిన ఇంజనీరు ఎవరు ?**

జ. గోలకొండ పట్టణ నిర్మాణ పథకానికి కర్త, ఆజంఖాన్ ఇంజనీరు.

**4. వజ్రాలకు పుట్టినిల్ల ఏది ?**

జ. వజ్రాలకు గోలకొండ పుట్టినిల్లు.

**5. ఒక హోను విలువ ఎంత ?**

జ. ఒక హోను నాలుగురూపాయల విలువ కలిగియుండేది. హోనును 'పెగోదా' అని కూడా పిలిచేవారు.

**6. పణము అంటే ఏమిటి ?**

జ. పణము అనేది హోనులో పదహారవ భాగము.

**7. కవి పండిత పోషకుడైన గోలకొండ పాదుషా ఎవరు ?**

జ. కవి పండిత పోషకుడైన గోలకొండ పాదుషా పేరు "ఇబ్రహిం కుతుబ్‌షా".

**8. మొట్టమొదటి అచ్చు తెనుగు కావ్యం ఏది ?**

జ. మొట్టమొదటి అచ్చు తెనుగు కావ్యము పేరు "యయాతి చరిత్ర".

**9. చార్మినార్‌ను ఏ సంవత్సరంలో నిర్మించారు ?**

జ. చార్మినార్‌ను క్రీ.శ. 1591వ సంవత్సరములో నిర్మించారు.

**10. గోలకొండను స్వాధీనం చేసుకొన్న మొగలు చక్రవర్తి ఎవరు ?**

జ. 1679 లో ఔరంగజేబు, గోలకొండను స్వాధీనం చేసుకొని నాశనం చేశాడు.

✲✲✲